జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## ఖమ్మం

బుధవారం | 19 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 5



## మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి
- సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** మహనీయుల జీవితాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్థానిక లకారం ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి, చిత్రపటానికి

మిగతా 2 లో...



# ప్రభుత్వ విద్యా ప్రమాణాల పెంపుతో పాటు మౌలిక వసతుల బలోపేతానికి ప్రాధాన్యత

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయాలు వేదికలుగా నిలవాలి
- విద్యార్థులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పించాలి
- పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యాలయ మేనేజ్మెంట్ కమిటీ సమావేశం లో పాల్గొన్న జిల్లా కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయాలు వేదికలుగా నిలవాలని, ప్రభుత్వ విద్యా ప్రమాణాల పెంపుతో పాటు మౌలిక వసతుల బలోపేతానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పోలేపల్లి షిరిడి సాయినాథ్ నగర్ లోని ఖమ్మం పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యాలయ మేనేజ్మెంట్ కమిటీ(VMC) సమావేశం జిల్లా కలెక్టర్, వియంసి చైర్మన్ దివాకర టీఎస్ అధ్యక్షతన నిర్వహించారు. విద్యాలయంలోని విద్యా ప్రమాణాలు, విద్యార్థుల పరీక్ష ఫలితాలు, ప్రవేశాల పరిస్థితి, సహపాఠ్య కార్యక్రమాలు, పీఎం శ్రీ కార్యక్రమాల అమలు, డిజిటల్ విద్య, మౌళిక వసతులు, విద్యార్థుల భద్రత, విద్యాలయ అభివృద్ధికి అవసరమైన కార్యచరణ, అభివృద్ధి పనులపై సమగ్రంగా సమీక్షించారు.విద్యార్థుల విద్యా ప్రగతిపై నిరంతర పర్యవేక్షణ ముందుగా విద్యాలయం లో గత విద్యా సంవత్సరంలో సాధించిన విద్యా ఫలితాలు, విద్యార్థుల ప్రగతి, సహ పాఠ్య కార్యక్రమాల్లో సాధించిన విజయాలపై అధికారులు, ఉపాధ్యాయుల నుంచి వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, విద్యార్థుల విద్యా సామర్థ్యాలను నిరంతరం అంచనా వేస్తూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థులలో కేవలం పుస్తక పరిజ్ఞానాన్ని పెంపొందించడం మాత్రమే కాకుండా,భవిష్యత్తులో ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, ఉపాధి అవకాశాలను

మిగతా 2 లో...

## కోనాయిగూడెం కంపు కొడుతుంది..!

- నెల రోజులకు ఒక్కే సారే చెత్త ట్రాక్టర్. దోమల స్వైర విహారం...
- ఎక్కడి చెత్త అక్కడే. మురుగు నీరు పారక... దుర్గందం...



**నేలకొండపల్లి, ఆగస్టు 18 ప్రజాజ్యోతి:** పాలకుల నిర్లక్ష్యం...ప్రజలకు శాపంగా మారుతుంది... .మురుగు కాల్వలు శుభ్రం చేయక... చెత్త ట్రాక్టర్లు తిప్పక..చెత్త చెదారం తో నిండిన ఖాళీ స్థలాలు వెరసీ కంపు కొడుతుంది.. ఇది ఎక్కడో కాదండి...నేలకొండపల్లి మండలంలోని కోనాయిగూడెం పంచాయతీ దుస్థితి. పంచాయతీ పాలకుల పట్టింపు లేక.. పంచాయతీ అధికారి పర్యవేక్షణ లేక పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతుంది... పంచాయతీలో ఉన్న వీధులలో మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవటంతో చెత్త చెదారం పేరుకపోయి... మురుగు నీరు కదలక దుర్గంధం వెదజల్లుతుంది..' గ్రామంలో ఫాగింగ్ విషయం ను ప్రజలు మరిచిపోయారు.దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి.ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. పంచాయతీ ట్రాక్టర్ చెత్త సేకరణ కోసం నెల రోజులకొకసారి మాత్రమే

మిగతా 2 లో...

## విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.
- సింగరేణి మండలం రేలకాయపల్లి గ్రామం లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**కారేపల్లి ,ఆగస్టు 18, ప్రజాజ్యోతి:** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు భవిష్యత్ లో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు.సింగరేణి మండలంలో మంగళవారం పర్యటించిన జిల్లా కలెక్టర్ మండల పరిధిలోని

మిగతా 2 లో...

## జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సివిల్ సప్లై బృందం తనిఖీలు

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశముల మేరకు, సివిల్ సప్లయస్ ఎన్ఫోరసెమెంట్ స్టాఫ్ బృందంగా ఏర్పడి, వైరాలోని పలు ప్రాంతముల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా,అష్ణగుర్తి గ్రామంలో బలగాని నర్సింహారావు అనే బియ్యం వ్యాపారి ఒక పాడుబడిన ఇంట్లో పందొమ్మిది తెల్లటి ప్లాస్టిక్ సంచులలో (9–50 Qtls) రేషన్ బియ్యమును అక్రమంగా నిల్వ చేసినాడు. రేషన్ బియ్యం ను సీజ్ చేసి రేషన్ డీలర్ కు తగు భద్రత నిమిత్తం అప్పగించి,బలగాని నరసింహారావు అనే అతనిపై 6ఎ కేసు నమోదు చేయడం జరిగినది.అదేవిధముగా, ఈ బృందము కొణిజర్ల మండలములో పలు రేషన్ షాపుల నందు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.మూడు నెలల బియ్యం ఒకేసారి ఇచ్చినందువలన, ఈ బృందం విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, రేషన్ డీలర్లు సక్రమంగా ఇస్తున్నారో లేదో పరిశీలించారు.ప్రతిరోజూ,బృందాలుగా ఏర్పడి, ఏదో ఒక మండలంలో తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు.



## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



**తిరుమలాయపాలెం ప్రజా జ్యోతి ఆగస్టు 19** మొగల్ సామ్రాజ్య అహంకారంపై సమర శంఖం పూరించి, గోల్కొండ కోటపై స్వాభిమాన పతాకాన్ని రెపరెపలాడించిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని పిండిప్రోలు గ్రామ ఉపసర్పంచ్ చామకూరి రాజ్ కుమార్ పేర్కొన్నారు మంగళవారం పిండిప్రోలు గ్రామంలో గౌడ సంఘం అధ్యక్షులు చావగాని ఉపేందర్ కార్యదర్శి చామకూరి వీరభద్రం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షులు చావగాని ఉపేందర్ ప్రధాన కార్యదర్శి చామకూరి వీరభద్రం మాట్లాడుతూ తెలంగాణ వీరత్వానికి ప్రతీకగా, తొలి బహుజన చక్రవర్తిగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. పిండిప్రోలు గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాపన్న గౌడ్ ఆశయాలు, పోరాట స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని వక్తలు అన్నారు.సామాజిక సమానత్వం, స్వాభిమానం కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని, బహుజనుల ఆత్మగౌరవానికి పాపన్న గౌడ్ ప్రతీకగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు చావగాని ఉపేందర్ ప్రధాన కార్యదర్శి చామకూరి వీరభద్రం చామకూరి శ్రీనివాస్ పరికిపల్లి చంద్రశేఖర్ చామకూరి రమేష్ నాథ్ సత్యనారాయణ చామకూరి రవి కాంపాటి వెంకన్న కాంపాటి నాగేశ్వరరావు గౌడ సంఘం నాయకులు, సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కోనాయిగూడెం కంపు కొడుతుంది..!







(మొదటి పేజీ తరువాయి... )

గ్రామంలో తిప్పుతున్నారు. దీంతో ప్రజల ఇళ్లలో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమస్తున్నారు. ప్రజలు పంచాయతీ కార్యదర్శి కి పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు పంచాయతీ పాలకుల పని తీరు పై చర్యలు తీసుకోవాలని... వెంటనే గ్రామంలో ఫాగింగ్ చేయించటం, మురుగు కాల్వలు శుభ్రం చేయించటం, ప్రతీ రోజు చెత్త సేకరణ కోసం పంచాయతీ ట్రాక్టర్ ను అన్ని వీధులలో తిప్పాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

(మొదటి పేజీ తరువాయి... )

రేలకాయపల్లి గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల ప్రవేశాలు, విద్యా ఫలితాలు, వారికి అందుతున్న భోజనం, వసతులు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లోకి వెళ్లిన కలెక్టర్ బోధనా తీరును పరిశీలించి, విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. విద్యార్థులు ఏయే సబ్జెక్టుల్లో ఆసక్తి చూపుతున్నారు, వారి భవిష్యత్ లక్ష్యాలు ఏమిటి, ఉన్నత విద్యలో ఏ కోర్సులను ఎంచుకోవాలని భావిస్తున్నారు, భవిష్యత్ లో ఏ రంగాల్లో స్థిరపడాలనుకుంటున్నారు అనే విషయాలను తెలుసుకున్నారు.పాఠశాలలోని లైబ్రరీ, మ్యూజిక్ రూమ్, ఆర్ట్స్ గ్యాలరీ, సైన్స్ ల్యాబ్ లను కలెక్టర్ పరిశీలించారు. సైన్స్ ల్యాబ్ లో విద్యార్థులు రూపొందించిన వివిధ ఆవిష్కరణలను తిలకించి వారిని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు.

ప్రస్తుతం పోటీ ప్రపంచంలో కేవలం విద్యార్హతలు మాత్రమే కాకుండా కమ్యూనికేషన్ స్కిల్స్, సాంకేతిక పరిజ్ఞానం, సమస్య పరిష్కార సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు వంటి నైపుణ్యాలు ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు కెరీర్ గైడెన్స్, ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, వివిధ ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలని సూచించారు.విద్యాధికారులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యాలయ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల విద్యా ప్రగతి, మౌళిక వసతులు, సిబ్బంది, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు తదితర అంశాలపై సమీక్షించారు.పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు ఖమ్మం– చీమలపాడు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, నూతనంగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని, పాఠశాల భవనం ప్రహరీ గోడపై సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటు చేయాలని, పాఠశాల ప్రాంగణంలో అదనపు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అంశాలపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి తనకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

విద్యార్థుల భద్రతకు, రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మౌళిక వసతుల అభివృద్ధికి చర్యలు పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతులు, విద్యా సదుపాయాలను మరింత మెరుగుపరచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, విద్యా సామగ్రి, ప్రయోగశాలలు, లైబ్రరీ, క్రీడా సదుపాయాలు, విద్యుత్, తాగునీరు తదితర వసతులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.విద్యార్థుల ఆరోగ్యం, పారిశుద్ధ్యం, నాణ్యమైన ఆహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను అధికారులు,పాఠశాల సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు.

సుమారు 9.57 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యాబోధన జరుగుతుండగా, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారిలోని ఆసక్తి, సామర్థ్యాలకు అనుగుణంగా భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకునేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానిని సాధించే దిశగా క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సింగరేణి తహసీల్దార్ వి .వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రిన్సిపాల్, గ్రామ సర్పంచ్ తేజ వత్ శిరీష, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలి



(మొదటి పేజీ తరువాయి... )

పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, సామాజిక సమానత్వం,బడుగు–బలహీన వర్గాల హక్కుల కోసం సర్దార్ సర్వాయి పాపన్న చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం ధైర్యంగా పోరాడిన మహనీయుడని అన్నారు. అన్యాయం, దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.సమాజంలోని బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం కోసం ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి,డాక్టర్ రాజశేఖర్ గౌడ్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.జానయ్య, నాయకులు అమరగాని వెంకన్న గౌడ్, కత్తి నెహ్రూ గౌడ్, పోలంపల్లి నాగరాజు గౌడ్, బండి నాగేశ్వరరావు గౌడ్, గజ్జెల్లి వెంకన్న, నూతి సత్యనారాయణ గౌడ్, వూడుగు శ్రీనివాస్ గౌడ్, బొల్లికొండ శ్రీనివాస్ గౌడ్,బిచ్చాల తిరుమలరావుగౌడ్, మారగాని సుదర్శన్ గౌడ్, బెల్లంకొండ శరత్ గౌడ్, మూడు ముంతల గంగరాజు గౌడ్, కొమిలి శ్రీనివాస్ గౌడ్, జి. శ్రీనివాసరావు, మార్కం లింగయ్య గౌడ్, దాసరి శ్రీరాములు గౌడ్, అల్లిక అంజయ్య, పగడాల నాగరాజు,గుడిద శ్రీనివాస్,వట్టికూటి ఉమాదేవి,డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, రుద్ర ప్రదీప్,మొక్క శేఖర్ గౌడ్, బిసి కుల సంఘ నాయకులు, వెనుకబడిన తరగతుల కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యా ప్రమాణాల పెంపుతో పాటు మౌలిక వసతుల బలోపేతానికి ప్రాధాన్యత



(మొదటి పేజీ తరువాయి... )

ఎదుర్కొనే విధంగా అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ అన్నారు.2026–27 విద్యా సంవత్సరంలో పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో కొత్తగా మొత్తం 256 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించినట్లు సమావేశంలో అధికారులు వివరించారు. ఇందులో 1వ తరగతిలో 121 మంది విద్యార్థులకు ఆన్ లైన్ ద్వారా ప్రవేశాలు కల్పించగా, కేవీఎస్ నిబంధనల ప్రకారం మరో 22 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించినట్లు వివరించారు.విద్యార్థుల ప్రవేశ ప్రక్రియలో పారదర్శకత, నిబంధనల అమలు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ సూచించారు.విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు,ఫర్నిచర్, తాగునీరు,పారిశుద్ధ్యం,మరుగుదొడ్లు,విద్యుత్, డిజిటల్ పరికరాలు వంటి సౌకర్యాలు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**డిజిటల్ విద్యకు ప్రాధాన్యత....**

విద్యాలయంలో డిజిటల్ విద్యకు అందుబాటులో పాఠశాలలో 55 కంప్యూటర్లు, హైస్పీడ్ బ్రాడ్ బ్యాండ్, వై–ఫై కనెక్టివిటీ,25 ఈ–క్లాస్ రూమ్ లు, ఇంటరాక్టివ్ బోర్డు ప్యానెల్స్ అందుబాటులో ఉన్నాయని అధికారులు వివరించారు.సీనియర్, జూనియర్ కంప్యూటర్ ల్యాబ్ లను విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మరింత సమర్థవంతంగా వినియోగించాలని కలెక్టర్ సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థుల అభ్యసనలో భాగం చేయాలని,డిజిటల్ వనరుల ద్వారా బోధనను మరింత ఆసక్తికరంగా,ప్రభావవంతంగా నిర్వహించాలని అన్నారు.

**క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత.....**

విద్యాలయంలో సుమారు మూడు ఎకరాల విస్తీర్ణంలో విశాలమైన క్రీడా మైదానం ఉందని, బాస్కెట్ బాల్, ఫుట్ బాల్, హ్యాండ్ బాల్, రెండు ఖో–ఖో కోర్టులు, కబడ్డీ కోర్టు వంటి సదుపాయాలు ఉన్నాయని అధికారులు వివరించారు.విద్యాలయ అవసరాలను సమీక్షించిన సందర్భంగా పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలు సమావేశం చర్చించారు.విద్యాలయంలో ప్రధాన సమస్యలుగా గుర్తించిన సమస్యలపై, విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. పాఠశాల ఆవరణలో చెట్ల కొమ్మలను తొలగించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, పాములు సంచరించే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.కోతి బెడద నివారణకు సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టాలని, విద్యార్థులు పాఠశాలకు రాకపోకలు సాగించే అప్రోచ్ రోడ్డును సురక్షితంగా మార్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా,పచ్చదనంతో,ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మొక్కల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు.విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు పర్యావరణ కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో ప్రిన్సిపాల్స్ జి.విజయలక్ష్మి ,వెంకటరమణ,డివైఎస్వోటి. సునీల్ రెడ్డి,ఆర్,బీ ఎస్ఈ యుగంధర్,డి.నవీన్ కుమార్, మెడికల్ ఆఫీసర్ యం. మహేందర్ రెడ్డి, పెరెంట్స్ మెంబర్ యం.అనిత,అధికారులు ఉపాధ్యాయులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలు భర్తీ చేయకపోతే ప్రభుత్వాలకు పతనం తప్పదు

- **ఆగస్టు 21న కోదుమూరులో ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా 25వ మహాసభలు జయప్రదం చేయండి**
- **ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్**



**నేలకొండపల్లి, ఆగస్టు 18 ప్రజా జ్యోతి** :కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేసి, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఏఐవైఎఫ్) ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్ డిమాండ్ చేశారు. ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగులను నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వాలకు పతనం తప్పదని హెచ్చరించారు.నేలకొండపల్లి మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఓట్ల కోసం హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటమాడుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వాల తీరుతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని అన్నారు.ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా యువతను మోసం చేస్తోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా లక్షలాది ఉద్యోగ ఖాళీలు ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయకుండా కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.తెలంగాణలో అధికారంలోకి వస్తే ఏటా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం నిరుద్యోగులను విస్మరించి కాలయాపన చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసి నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యువత ఆగ్రహాన్ని ప్రభుత్వాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యార్థులకు సంబంధించిన సుమారు రూ.11 వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. యువత ఓపికను పరీక్షించవద్దని, సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో మరింత ఉధృతమైన పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా 25వ జిల్లా మహాసభలు ఆగస్టు 21న శుక్రవారం చింతకాని మండలంలోని కోదుమూరు గ్రామంలో నిర్వహించనున్నట్లు మల్లెబోయిన ఉపేందర్ తెలిపారు. నిరుద్యోగులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, విద్య, ఉపాధి తదితర సమస్యలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పాలపాటి అశోక్, ఏఐవైఎఫ్ కోశాధికారి బాలిన కృష్ణంరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మూడు శ్రీనివాస్, పాలపాటి నవీన్, కోమ్ము అఖిల్ పాల్గొన్నారు.

# అణగారిన వర్గాలకు ప్రతీక సర్వాయి పాపన్న గౌడ్



**సత్తుపల్లి ఆగస్టు18(ప్రజా జ్యోతి)**గెరిల్లా పోరాటంతో దళిత, బహుజనుల రాజకీయ, సామాజిక సమానత్వం కోసం కృషి చేసిన గొప్ప యుద్ధ వీరుడు, నిరంకుశత్వంపై నిప్పుకణికలా పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకలను సత్తుపల్లి పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించినారు. పట్టణ గౌడ సంఘం అధ్యక్షులు చిట్టిబొమ్మ రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పట్టణ గౌడ సంఘ ప్రముఖులు చింతలపాటి వెంకటేశ్వర రావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ గాదె చెన్నకేశవ రావు పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు.గౌడ సంఘాల నాయకులు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆయన స్ఫూర్తితో రాజ్యాధికారం దిశగా బహుజనులంతా ఏకమై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు కృషి చేయాలని అన్నారు.ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటాలు, సమాజంలో సమానత్వం కోసం ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో గోపా నియోజకవర్గ అధ్యక్షులు డాక్టర్ కట్టా శివాజీ గారు, గౌడ కులస్తులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ కేసుల నమోదు తప్పనిసరి

- **జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. డి. రామారావు**



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లా కేంద్రంలోని మమత జనరల్ హాస్పిటల్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.డి.రామారావు ఈ మంగళవారం సందర్శించారు.ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సంబంధిత వైద్యులు,అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.సమావేశంలో ప్రధానంగా క్యాన్సర్ కేసుల నమోదు, ఏఎఫ్‌పీ(అక్యూట్ ఫ్లాసిడ్ పెరాలసిస్) పర్యవేక్షణ,టీకాలతో నివారించగల వ్యాధుల (వ్యాక్సిన్ ప్రింటబుల్ డిసీజెస్) పర్యవేక్షణ అంశాలపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డా.డి.రామారావు మాట్లాడుతూ, క్యాన్సర్‌ను నోటిఫైయబుల్ డిసీజ్ గా ప్రభుత్వం గుర్తించిన నేపథ్యంలో క్యాన్సర్ కేసుల నమోదులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ స్పష్టం చేశారు.జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు,డయాగ్నోస్టిక్ ల్యాబొరేటరీలు, రక్త పరీక్ష కేంద్రాలు, స్కానింగ్ కేంద్రాల్లో క్యాన్సర్ నిర్ధారణ అయిన ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను ప్రభుత్వం నిర్దేశించిన https://cancerportal.telangana.gov.in క్యాన్సర్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు.

### క్యాన్సర్ పోర్టల్‌లో నమోదు తప్పనిసరి:

క్యాన్సర్ నిర్ధారణ అయిన వెంటనే రోగికి సంబంధించిన అవసరమైన వివరాలను పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా జిల్లాలో క్యాన్సర్ వ్యాప్తి,వివిధ రకాల క్యాన్సర్ కేసుల సంఖ్య, వాటి తీవ్రత తదితర అంశాలపై సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ప్రభుత్వం ముందస్తు గుర్తింపు, చికిత్స, అవగాహన,నివారణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందని జిల్లా ఆరోగ్య శాఖ వీటిని అన్నింటిని సమన్వయం చేస్తుందని పేర్కొన్నారు.

### సంపూర్ణ వివరాల నమోదు:

క్యాన్సర్ శరీరంలోని ఏ అవయవానికి సంబంధించినది,నిర్ధారణ జరిగిన తేదీ,అవసరమైన వైద్యపరమైన వివరాలు తదితర సమాచారాన్ని సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. సరైన సమాచారం అందుబాటులో ఉండటం వల్ల రోగులకు సకాలంలో తగిన వైద్య సేవలు అందించడంతో పాటు,ప్రజారోగ్య పరిరక్షణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయవచ్చని తెలిపారు.

### రోగుల వివరాలకు గోప్యత:

పోర్టల్‌లో నమోదు చేసే రోగుల వ్యక్తిగత మరియు వైద్యపరమైన వివరాలను గోప్యంగా నిర్వహించాలని, సమాచార భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు.

### ఏఎఫ్‌పీ పర్యవేక్షణ:

అక్యూట్ ఫ్లాసిడ్ పెరాలసిస్ (ఏఎఫ్‌పీ) కేసులపై నిరంతరం నిఘా కొనసాగించాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు.పిల్లల్లో అకస్మాత్తుగా చేతులు,కాళ్లలో బలహీనత లేదా పక్షవాతం వంటి లక్షణాలు కనిపించిన సందర్భాల్లో అలాంటి కేసులను వెంటనే గుర్తించి,సంబంధిత ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.ఏఎఫ్‌పీ కేసులపై సకాలంలో విచారణ,నమూనాల సేకరణ,అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని తెలిపారు.

### టీకాలతో నివారించగల వ్యాధులపై నిఘా:

టీకాలతో నివారించగల వ్యాధుల పర్యవేక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని డా.రామారావు సూచించారు.అనుమానిత కేసులను వెంటనే గుర్తించడం,సంబంధిత వివరాలను నమోదు చేయడం,అవసరమైన నమూనాలను సేకరించడం,టీకాల ద్వారా వ్యాధుల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి చర్యలను సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు.ప్రజారోగ్య పరిరక్షణలో ఆసుపత్రులు,ప్రైవేట్ వైద్య సంస్థలు, డయాగ్నోస్టిక్ కేంద్రాలు,ఆరోగ్యశాఖ మధ్య సమన్వయం ఎంతో ముఖ్యమని డీఎంహెచ్ఓ పేర్కొన్నారు.ప్రభుత్వం నిర్దేశించిన ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని సకాలంలో అందించడం ద్వారా జిల్లాలో వ్యాధుల నియంత్రణ, ముందస్తు గుర్తింపు,నివారణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయవచ్చని తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో మమత జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్,వైద్యులు,సంబంధిత ఆరోగ్యశాఖ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

- **ప్రజ్వల సంస్థ కోఆర్డినేటర్ భూపాల్**
- **ఆడపిల్లలపై జరిగే మోసాలపై అవగాహన కలిగి ఉండాలి**
- **మండల సమైక్య ఏపీఎం కొట్టే వెంకటేశ్వర్లు**





**బోనకల్, ఆగస్టు 18(ప్రజా జ్యోతి):** మండల మహిళా సమాఖ్య, బోనకల్ ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా పై శిక్షణ ను స్థానిక మండల సమాఖ్య మీటింగ్ హాల్ నందు మంగళవారం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ప్రజ్వల సంస్థ కోఆర్డినేటర్ భూపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద నేరంగా ఉందని, ప్రతి రోజు ఎంతోమంది అమ్మాయిలు మహిళలు మోసపోతున్నారు. కాబట్టి మానవ అక్రమ రవాణాలను అరికట్టాలని, దీనిపై గ్రామ స్థాయిలో ప్రజలతో మంచి సంబంధలాను కలిగి ఉన్న వివో ఏ లు అవగాహనా కల్పించాలి అని అన్నారు ముక్యంగా ఏదైనా సమస్య ఎదురైనపుడు 112 పోలీస్, 1930 సైబర్ ట్రాఫికింగ్, 181 మహిళా హెల్ప్ లైన్ 1098 చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్స్ ను సంప్రదించాలని అన్నారు అక్రమ రవాణాకి సంబందించిన విషయాలను లఘు చిత్రాలు పవరపాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వివరించారు. మహిళా సంగం సభ్యులతో ఒక జాగృతి సంఘాన్ని ఏర్పాటు చేయడం ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించే విదంగా ఉంటారనీ అన్నారు.మండల సమైక్య ఏపిఎం కొట్టే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.... మానవ అక్రమ రవాణా, ఆడపిల్లల మోసాలపై అవగాహనా ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం ఉంది అన్నారు. జిల్లా స్థాయి నుండి ఈ శిక్షణను ఇవ్వడం జరిగింది. ప్రతి ఒక్క గ్రామ సహాయకురాలు ఈ అక్రమ రవాణాపై అవగహన పొంది, గ్రూప్ మీటింగ్ లలో గ్రామ సభల్లో అందరికి వివరించాలని అన్నారు. ముక్యంగా మహిళలు, బాలికలలు దీనిపై అవగాహన కలిగి ఉండాలి అని అన్నారు. ఈ శిక్షణలో ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్లు హరీష్, నాగరాణి ,మండల మహిళా సమాఖ్య కమ్యూనిటీ కోఆర్డినేటర్స్, మండల గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి



**కామేపల్లి ప్రజా జ్యోతి ఆగస్టు 18** ఇల్లందు నియోజకవర్గంలో కామేపల్లి మండలంలోని నెమలిపురి తండాలో మాజీ సర్పంచ్ మోహన్ అన్న గారి కుమారుడు వివాహంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి గారు ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గింజల నర్సిరెడ్డి మాజీ ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య నెమలిపురి గ్రామ కమిటీ మరియు సర్పంచ్ బలరాం నాయక్ ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది.

## నేతాజీ సుభాష్ చంద్రబోస్ కు ఘన నివాళులు

- నివాళులర్పించిన నాయకులు, యువకులు



**బోనకల్, ఆగస్ట్ 18(ప్రజా జ్యోతి):** మండల కేంద్రంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా నాయకులు, యువత బోసు బొమ్మ సెంటర్‌లో ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన జాతీయ ఉద్యమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ కిలక పాత్ర పోషించారని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. "నాకు రక్తాన్ని ఇవ్వండి.. నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను" అనే ఆయన నినాదం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, పురోగతిలో యువత చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. "తుపాకీకి తూటా ఎలాగో.. భారత స్వాతంత్ర్య సమరంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్ర అలాంటిది" అని కొనియాడుతూ ఆయన చూపిన దేశభక్తి, త్యాగం, ధైర్యం మార్గంలో నడవాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. నివాళులర్పించిన వారిలో మచ్చ గురవయ్య, ఎస్.కె. జాన్ పాషా, రషీద్, నన్నే సాహెబ్, షేక్ బాజీ, మున్న, సిద్దు, వెంకన్న, అన్నమయ్య, పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందుబాటు లోకి తేవాలి

**కారేపల్లి, ఆగస్టు 18, ప్రజా జ్యోతి:** ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు సింగరేణి మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఆసుపత్రిని పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, అందుకు అవసరమైన వైద్యులు, సిబ్బంది, మందులు, వైద్య పరికరాలు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) లో నెలకొన్న సమస్యలపై సీపీఎం బృందం సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్య సిబ్బంది, మందుల లభ్యత, వైద్య పరికరాలు, రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఏజెన్సీ ప్రాంతంలో పేద, గిరిజన ప్రజలు ప్రభుత్వ వైద్యంపైనే ఆధారపడుతున్నారని, అయితే ఆసుపత్రిలో ఎక్స్రే తదితర రోగ నిర్ధారణ పరికరాలు అందుబాటులో లేకపోవడంతో అనేక మంది ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిం చి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కారేపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి, మాణిక్యారం చీమలపాడు ప్రాంతంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పి హెచ్ సి ని మంజూ రు చేయాలని అవసరమైన వైద్య పరికరాలు, వైద్యులు, సిబ్బంది, 102 అంబులెన్స్ సౌకర్యాలు అందుబాటులోకి తేవాలని, ఖాళీగా ఉన్న మహిళా డాక్టర్, ఫార్మాసిస్ట్, సూపర్వైజర్ పోస్టల్ భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అత్యధిక జనాభా కలిగి మారుమూల ప్రాంతాల ఏజెన్సీ ప్రజల ప్రభుత్వ వైద్యం అందించుటకు స్థానిక ఎమ్మెల్యే, జిల్లా వైద్యశాఖ ఉన్నత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కారేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రా (పి హెచ్ సి) నీ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సి హెచ్ సి) గా అప్ గ్రేడ్ చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సర్వేలో పార్టీ మండల కా ర్యదర్శి కే నరేంద్ర, నాయకులు వజ్జా రామారావు, యనమనగండ్ల రవి, కొండబోయిన ఉమావతి, బానోత్ బన్సీలాల్, తలారి దేవ ప్రకాష్, కేశగాని ఉపేందర్, ముక్కా సీతారాములు, దాసరి మల్లయ్య, అజ్మీర్ శోభన్, రేగళ్ల మంగయ్య, ముండ్ల ఏకాంబరం, పండగ కొండయ్య, ఎండి ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రాజకీయ వ్యవహారాల (పి ఏ సి) కమిటీ సమావేశం

- ముఖ్య అతిథిగా ఏ ఐ సి సి కార్యదర్శి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల కో ఇంచార్జి సచిన్ సావంత్
- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్య నారాయణ గౌడ్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్య నారాయణ గౌడ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ సూచనల మేరకు బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో ఉదయం 10.00 గంటల నుండి 10.45 నిమిషాల వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం, 11.00 గంటల నుండి 11.45 నిమిషాల వరకు ఖమ్మం జిల్లా రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం అనంతరం ఖమ్మం కార్పొరేషన్ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం నిర్వహించబడుతుంది అని, ఈ సమావేశాలకు ఏ ఐ సి సి కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర పార్టీ వ్యవహారాల కో ఇంచార్జి సచిన్ సావంత్ విచ్చేయుచు న్నారని, అదే విధంగా ఈ సమావేశాలలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి మరియు శాసన సభ సభ్యులు పాల్గొంటారు. కావున జిల్లా కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘ అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు అందరు విచ్చేసి కార్యక్రమమును జయప్రదం చేయగలరని పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేసిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్.

## గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె



**కారేపల్లి, ఆగస్టు 18, ప్రజా జ్యోతి:** సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకై సింగరేణి మండలం లోని 41 గ్రామపంచాయతీ లకు సంబంధించిన గ్రామపంచాయతీ కార్మికులు తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (CITU అనుబంధం) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ఎంపీడీవో ఆఫీస్ వద్ద టెంటు వేసి రిలే దీక్షలు చేసి నిరసన తెలియజేశారు. సిఐటియు సింగరేణి మండల కన్వీనర్ కే.నరేంద్ర పూలమాలలు వేసి రిలే దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ మండల కార్యదర్శి ఎస్. నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన దీక్షలను ఉద్దేశించి కే. నరేంద్ర మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల వద్దకు కాంగ్రెస్ నాయకులు వచ్చి గ్రామపంచాయతీ కార్మికులు కోరుతున్న కోరికలు న్యాయమైన మని రాజ్యాంగబద్ధంగా కార్మిక చట్టాలను అనుసరించి వారికి రావలసిన సౌకర్యాలను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేస్తామని మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేస్తామని జీవో నెంబర్ 51 సవరిస్తామని హామీ ఇచ్చారని అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సంవత్సరాలకు పైగా దాటుతున్న ఇంతవరకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని కే నరేంద్ర విమర్శించారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కనీస వేతనం 26,000 ఇవ్వాలని జీవో నెంబర్ 51 సవరణ చేసి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్టుగా గ్రీన్ ఛానల్ ద్వారా జీతాలు కార్మికుల ఎకౌంట్లో జమ చేయాలని, అక్రమంగా సిబ్బందిని తొలగిస్తున్న గ్రామపంచాయతీ సర్పంచులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, మరణించిన కార్మికుల కు దహన సంస్కారాలకు కనీసం 30 వేలు ఇవ్వాలని, గ్రామపంచాయతీ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూములు మంజూరు చేయాలని కే నరేంద్ర డిమాండ్ చేశారు. ప్రస్తుతం పై సమస్యల పరిష్కారానికి రెండు రోజులు మాత్రమే సమ్మె నిర్వహిస్తున్నామని పరిష్కరించని ఎడల భవిష్యత్తులో సుదీర్ఘ దీర్ఘకాలిక సమ్మెకు దిగవలసి వస్తుందని, ప్రభుత్వ కార్యాలయాల ముట్టడిని కూడా పై కమిటీ మేరకు విజయవంతం చేయాల్సి ఉంటుందని దీనికి పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని కే. నరేంద్ర హెచ్చరించారు. ఈ సమ్మె రిలే దీక్ష నిరసన కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే హుస్సేన్, మండల కోశాధికారి గుగులోతు శ్రీను, నాయకులు బోళ్ల కొమరయ్య, పాలిక తిరపయ్య, యాదగిరి, ఉపేందర్, సుల్తానా, హేమ చంద్, సుక్య, అచ్చయ్య, హిట్లర్, మంగీలాల్, గ్రామపంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## మోసం, దొంగతనం కేసులో ముగ్గురు నిందితులకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మోసం, దొంగతనం కేసులో ఎ 1 నుంచి ఎ 3 వరకు ముగ్గురు నిందితులను న్యాయస్థానం దోషులుగా నిర్ధారించి శిక్ష విధించింది. ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో 2023 లో నమోదు అయిన క్రైమ్ నెంబర్ 198/2023 IPC సెక్షన్లు 420,380 r/w 34 కింద కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి CC. No.2124/2023లో విచారణ పూర్తయిన అనంతరం మూడవ అదనపు జే ఎఫ్ సి ఎం కోర్టు, ఖమ్మం నిందితులకు శిక్ష విధించింది.

**నిందితులు...** ఎ 1 రాచబండి గురువయ్య గురుమూర్తి, 44 సం, మంగళగూడెం గ్రామం, ఖమ్మం రూరల్ మండలం, ఎ 2 బోడ రమేష్, వయస్సు 37సం,, పిక్లితండా, పుల్లూరు గ్రామం, గార్ల మండలం. ఎ 3 బానోత్ సంతోష్ కుమార్, వయస్సు 28 సం,, బర్లగూడెం గ్రామం, కామేపల్లి మండలం. న్యాయమూర్తి అరవా ప్రవీణ్ గారు ఎ 1 నుంచి ఎ 3 వరకు ప్రతి ఒక్కరికి ఐపీసీ సెక్షన్ 420 r/w 34 కింద మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 5,000 జరిమానా, అలాగే ఐపీసీ సెక్షన్ 380 r/w 34 కింద మరో 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు. ముగ్గురు నిందితుల నుంచి చెల్లించాల్సిన మొత్తం జరిమానా రూ.30,000. జరిమానా చెల్లించని పక్షంలో ప్రతి జరిమానాకు మూడు నెలల సాధారణ కారాగార శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. రెండు నేరాలకు విధించిన జైలు శిక్షలు ఏకకాలంలో అమలు అవుతాయి. ఈ కేసులో దర్యాప్తు అధికారిగా ఎస్సై బి . రాము నాయక్, బ్రీఫింగ్ అధికారిగా ఖమ్మం త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ మోహన్ బాబు వ్యవహరించారు. ప్రాసిక్యూషన్ తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.గాయత్రి వాదనలు వినిపించారు. కేసు సమన్వయంలో కోర్టు లైజన్ అధికారులు ఎస్సై కె .శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుల్ కె .శ్రీనివాస్,, డి . నాగేశ్వరరావు, కోర్టు కానిస్టేబుల్ వి . రామకృష్ణ, తదితరులు సహకరించారు.

## వేంసూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీ పోస్టులు భర్తీ చేయండి

**వేంసూరు, ఆగస్టు18 ప్రజాజ్యోతి** నియోజక వర్గ పరిధిలోని వేంసూరు మండల కేంద్రంలో గల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సులు, లాబ్ టెక్నీషియన్ పోస్టులు భర్తీ చేయాలని సీపీఎం జిల్లా కమిటి సభ్యులు మోరంపూడి పాండురంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై చేసిన సర్వేలో వెల్లడైందని పాండు మీడియాకు తెలిపారు. శానిటేషన్ పోస్టులు 03 గుర్రుకు కేవలం ఒకరే ఉన్నారనీ మరొకరిని డిప్యూటేషన్ పై పంపారని తెలిపారు. ఏం.ఎల్.హెచ్.పి. (పల్లె దవాఖాన వైద్యులు) 07 గురుకు 04 గురు మాత్రమే ఉన్నారని (అడసర్లపాడు, చౌడవరం, కేజీ మల్లెల), మొదటి శ్రేణి ఏ.ఎన్.ఏం లు 09 మందికి కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారని తెలిపారు. ఈ సర్వే లో సీపీఎం మండల కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్రావు, నాయుకులు మల్లూరు చంద్రశేఖర్, దంకర శ్రీను, కావూరి భగత్ సింగ్ లు పాల్గొన్నారు.



# గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బోయి నపల్లి వీరబాబు
- మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్ష చేపట్టిన గ్రామపంచాయతీ కార్మికులు



**బోనకల్, ఆగస్టు 18 (ప్రజా జ్యోతి):** మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి సరైన న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బోయినపల్లి వీరబాబు, కిలారు సురేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ సిబ్బంది సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలను మంగళవారం చేపట్టారు. ఈ దీక్షలను వారు లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. మరణించిన కార్మికుని దహన సంస్కారాలకు కనీసం రూ. 30,000 ఆర్థిక సహాయం అందించాలని, పంచాయతీ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇల్లు, ఇండ్ల స్థలాలు, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి హామీ ప్రకారం గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల ఎకౌంట్లో వేతనాలు జమ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి అంటువ్యాధులు, అనారోగ్యాలు రాకుండా ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న పంచాయతీ కార్మికుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కారం చేయటం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి కనీస వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. సుమారు మూడు సంవత్సరాలు అవుతున్న వారి సమస్యలను పరిష్కారం చేయకపోవడం బాధాకరమన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల శ్రమను రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంటుందని ఆరోపించారు. కనీస వేతనం రూ. 26,000 నిర్ణయించాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం మధిర డివిజన్ కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, సీఐటీయూ మండల మాజీ కార్యదర్శి బోయినపల్లి కొండ దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం మద్దతు తెలిపి మాట్లాడారు. లక్ష్మీపురం సొసైటీ అధ్యక్షులు మాదినేని వీరభద్ర రావు, సీపీఐ(ఎం) లక్ష్మీపురం శాఖా కార్యదర్శి తమ్మారపు లక్ష్మణ్ రావు, రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు, సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు మరీదు పుల్లయ్య, మండల ప్రధాన కార్యదర్శి అంతోటి రమేష్, గ్రామపంచాయతీ కార్మికులు మంద నాగరాజు, పూజల శ్రీనివాసరావు, కర్లపూడి వెంకటేశ్వర్లు, ఆముదాల రంగారావు, కొత్తపల్లి రమేష్, గుగులోతు వెంకటేశ్వర్లు, అంతోటి నాగేశ్వరరావు, షేక్ దస్తగిరి, షేక్ ఖాసీం, మరీదు కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కుంటను పరిశీలించిన అధికారులు



**చింతకాని, ఆగస్టు 18 ప్రజాజ్యోతి** చింతకాని మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో చింతల రామారావుకు చెందిన వ్యవసాయ కుంటను ఏపీవో కోటయ్య,టీఏ కృష్ణయ్య తదితర అధికారులు పరిశీలించారు. వ్యవసాయ కుంట నిర్మాణ పనుల పురోగతి, నాణ్యతను పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు.రైతులకు సాగునీటి వసతి కల్పించడంతో పాటు భూగర్భ జలాల పెంపునకు వ్యవసాయ కుంటలు ఎంతగానో ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. కుంట నిర్మాణ పనులను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, గ్రామ కార్యదర్శి కొండపల్లి ఉమారాణి, మేట్ మడిపల్లి రామకృష్ణ, గ్రామపంచాయతీ సిబ్బంది చాపలమడుగు సైదులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ వర్కర్స్ నిరసన దీక్ష



**తిరుమలాయపాలెం ప్రజా జ్యోతి ఆగస్టు 19** తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో మొదటి రోజు గ్రామపంచాయతీ వర్కర్స్ డిమాండ్ తో కూడిన నిరసన దీక్ష ను తిరుమలాయపాలెం ఎంపీడీవో ఆఫీస్ ముందువిజయవంతంగా కార్మికులు పాల్గొన్నారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు వసపంగువీరన్న మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు కార్మికులకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి మోసం చేసిందని సాలిసాలని జీతంతో బతుకులు ఈడిస్తున్న గ్రామపంచాయతీ వర్కర్ల పట్ల ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందని ఇప్పటికైనా గ్రామాభివృద్ధికి పట్టుకొమ్మలైన గ్రామపంచాయతీ వర్కర్స్ ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ వారి కుటుంబాల్లో వెలుగును నింపుతూ గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం చేసుకొని పరిపాలన కొనసాగించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే బషీర్ ఎస్ కే పాషా మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వర్కర్స్ కు ఇబ్బందిగా ఉన్న జీవో నెంబర్ 51 ని వెంటనే సవరించాలని మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని అర్హులైన గ్రామపంచాయతీ కార్మికులందరికీ డబల్ బెడ్ రూమ్ ఇందిరమ్మని ఇవ్వాలని గ్రీన్ ఛానల్ ద్వారా ముఖ్యమంత్రి గారు ఇచ్చిన హామీ ప్రకారము వేతనాలు చెల్లించాలని కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని ఇట్టి న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని అమలుపరచాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు రెండో రోజు కూడా దీక్షలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక నాయకులు కోరారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ యూనియన్ నాయకులు ఎస్కే బషీర్, ఎస్కే పాషా జిల్లా ఉప్పలయ్య సంగయ్య గురవయ్య శ్రీను కొమ్ము రవిసైదులు రామ్మూర్తి కొప్పుల రాజేష్ ముత్తయ్య బంక వెంకటేశ్వర్లు సీమ నాగేష్ నేలమర్రి బాబు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు

- సర్పంచ్ -పక్రుద్దీన్





**వేంసూర్ ఆగస్టు 18 ప్రజాజ్యోతి** వేంసూరు గ్రామంలోని ప్రగతి నగర్ డబల్ బెడ్ రూమ్ ప్రాంతంలో, గ్రామ సర్పంచ్ అయిన ఎండి ఫక్రుద్దీన్ పరిసరాల పరిశుభ్రత విషయంలో అద్భుతమైన కృషిని ప్రదర్శిస్తున్నారు. ఆయన డబుల్ బెడ్‌రూమ్స్ ఉన్న ప్రతి గృహాన్ని, అలాగే ప్రతి వీధిని స్వయంగా సందర్శిస్తూ, పరిశుభ్రతకు సంబంధించిన పనులను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారు.ప్రజల ఆరోగ్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా పరిగణిస్తూ, అనేక సమగ్ర చర్యలను ఆయన అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా, బ్లీచింగ్ పౌడర్‌ను వెదజల్లించడం, మురుగునీటి పారుదల వ్యవస్థను సమర్థవంతంగా ఏర్పాటు చేయడం, ఇంటింటి నుండి చెత్తను సేకరించే ప్రక్రియను పటిష్టం చేయడం, మరియు దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయించడం వంటివి ఉన్నాయి. ఈ విధంగా ఆయన ప్రజారోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉన్నారు.గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజల శ్రేయస్సును కాంక్షిస్తూ, ఫక్రుద్దీన్ ఒక ఆదర్శవంతమైన సర్పంచ్‌గా విస్తృతంగా గుర్తింపు పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీ ఎండి ఫక్రుద్దీన్ తో పాటు, ఉప సర్పంచ్ ఈడ కొండలరావు ,గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లెల్లి నరసింహాస్వామి వార్డు నెంబర్ నాభి కిన్నెర లాజర్ రమేష్ కిన్నెర మారయ్య ఆశ వర్కర్లు, మరియు అంగన్‌వాడీ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని సహకరించారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు

- సుబ్లేడులో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు




**తిరుమలాయపాలెం ప్రజా జ్యోతి ఆగస్టు 19** తిరుమలాయపాలెం మండలం లోని సు బ్లేడు ప్రజా ప్రభుత్వంలో భా గంగా తిరుమలయపాలెం మండలం సుబ్లేడు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. ఇందులో భాగం గా మంగళవారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏ ఎన్ ఎం సుభద్ర నేతృత్వం లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో గ్రామ ప్రజలకు బీపీ, షుగర్ త దితర వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి మందులు పం పిణీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ, ఆరోగ్యం పై అవగాహన కల్పిస్తున్న ఆసుపత్రి సిబ్బంది సేవలను గ్రామ ప్రజలు అభినందించారు. ఏఎన్ఎం సుభద్ర మాట్లాడు తూ, వర్షాకాలంలో సీజనల్ వ్యా ధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూ చించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత ప రిశుభ్రత పాటించి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

### సేవలో ముందుండే వైద్య సిబ్బంది....

ప్రజలకు వైద్య పరీక్షలు, మందుల పంపిణీతో పాటు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న సుబ్లేడు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది సేవలు అభినందనీయమని గ్రామ ప్రజలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు దోమల్ల సత్యవతి, కూరపాటి లత, మోటామర్రి నాగేంద్ర తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి అమెరికా పర్యటన విజయవంతం కావాలి

- వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

**కారేపల్లి, ఆగస్టు 18, ప్రజా జ్యోతి:** అమెరికా పర్యటనకు బయలుదేరుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డినీ వైరా4 శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి హ్యాపీ జర్నీ అంటూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వైరా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చర్చించారు. వైరా నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, సాగునీరు, విద్య, వైద్యం తదితర అంశాలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. ఈ సందర్భంగాఅమెరికా పర్యటనలో రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు, నిధులు తీసుకువచ్చి తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని, వైరా నియోజకవర్గ అభివృద్ధికి కూడా ప్రత్యేక సహకారం అందించాలని ఎమ్మెల్యే ముఖ్యమంత్రిని కోరారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

